# కాంక్రీట్ మిల్లర్లను ఆదుకోవాలి

## తెలంగాణ కాంక్రీట్ మిల్లర్స్, లేబర్ యూనియన్ సభ్యులు

బండ్లగూడ, ఏప్రిల్ 10: రాష్ట్రంలోని కాంక్రీట్ మిల్లర్స్‌ను తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ కాంక్రీట్ మిల్లర్స్ ఓనర్స్, లేబర్ యూనియన్ చైర్మన్ నాగరాజు పేర్కొన్నారు. గురువారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బిల్డర్స్, సెంట్రింగ్ తాపీ మేస్త్రీలతో కాంక్రీట్ మిల్లర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ కాంక్రీట్ మిల్లర్స్ ఓనర్స్, లేబర్ యూనియన్ చైర్మన్ వి నాగరాజు మాట్లాడుతూ కాంక్రీట్ బిల్లల రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కాంక్రీట్ యం త్రం రోడ్డు పైకి వస్తే పోలీసులు వేల రూపాయలు చాలాన్లు వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రెక్క ఆడితే గాని తిండికి నోచుకోలేని తాము వేల రూపాయలు ఎక్కడి నుంచి కట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక జీవో తీసుకొచ్చి మిల్లర్లను రోడ్లపై ఎక్కడ ఆపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాంక్రీట్ పనిలో భాగంగా తమ లేబర్లు భవనాల నుంచి కిందపడి చనిపోతున్నారన్నారు. వారికోసం తగిన బీమాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర శివారు ప్రాంతాల్లో ఆర్ఎంసీ ప్లాంట్‌లు ఏర్పాటు చేయడం ద్వారా తమకు పని దొరకకుండా పోతుందన్నారు. ఆర్ఎంసీ ప్లాంట్ల ద్వారా పర్యావరణ కాలుష్యం పెరిగి అనేక రోగాలకు దారితీస్తుందన్నారు. మిల్లర్ల నిర్వాహకులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లతోపాటు పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంక్రీట్ మిల్లర్స్ ఓనర్స్, లేబర్ యూనియన్ కన్వీనర్ రవికుమార్ రెడ్డి, గోపాల్, శ్రీను యాదవ్, రేపల్లె కృష్ణ వాల్మీకి, నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



తెలంగాణ కాంక్రీట్ మిల్లర్ల ఓనర్స్ లేబర్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ చైర్మన్ నాగరాజు

## బీసీలను ఏకం చేయండి

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



ఎమ్మెల్సీ కవితకు పూలబొకేను అందజేస్తున్న బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు, చిత్రంలో దూగుంట్ల నరేశ్ తదితరులు

బండ్లగూడ, ఏప్రిల్ 10. రాజేంద్రనగర్ నియోజకవర్గం లో బీసీల అందరిని ఏకం చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. గురువారం బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ బి ఆర్ ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె నియోజకవర్గ గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆవే మాట్లాడుతూ ప్రభుత్వ తప్పిదాలను ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన తీరును ప్రజలకు వివరించాలన్నారు. బీసీల అందర్నీ ఏకం చేయాలని సూచించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు దుర్గేష్, నరేష్ తదితరులు ఉన్నారు.

## 'యువకుల సమస్యలు పరిష్కరించాలి'

హిమాయత్‌నగర్, ఏప్రిల్10: రాష్ట్రంలోని యువకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యువత ఉన్నత విద్యను చదువుకున్నప్పటికీ వారికి తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు.యువతకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనిపక్షంలో బలమైన పోరాటాలు కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## బీసీలో ఐక్యత లేకనే..వెనుకబాటుతనం

### 14 నుంచి లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్రకు శ్రీకారం

### బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ డాక్టర్ విశారధన్



మా భూమి రథయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిసున్న విశారధన్, రాఘవేందర్, వినోద్ యాదవ్ తదితరులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 10 : రాష్ట్రంలోని బీసీ సామాజికవర్గాల్లో చైతన్యం కొరవడి వెనుకబాటుకు గురయ్యారని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ డాక్టర్ విశారధన్ మహరాజ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఒక్కసారిగా కూడా బీసీలకు ప్రాతినిధ్యం దక్కలేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు రాజ్యాధికారమే లక్ష్యంగా ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ డైట్ కళాశాల మైదానం వేదికగా మా భూమి రథయాత్రను ప్రారంభిస్తున్నామని, 39 నెలల పాటు రాష్ట్రమంతా తిరుగతూ ప్రజా సమస్యలపై ఆరా తీస్తామన్నారరు. సుమారు లక్ష కిలోమీటర్లు ఈయాత్ర ఉంటుంద న్నారు. 20 28 జూలై 11 హైదరాబాద్‌లో యాత్ర ముగుస్తుందన్నారు. అనంతరం రథయాత్రకు సంబ ంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కో కన్వీనర్లు తోట్ల రాఘవేందర్ ముదిరాజ్, రాసాల వినోద్ యాద వ్, సాయి బాబా , అబ్దుల్ రహమాన్, గడ్డం మనీష్ గౌడ్, రాజ్ కమల్ పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే.. సంపూర్ణ ఆరోగ్యం



మార్కండేయనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న పద్మజ

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 10: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శేరిలింగంపల్లి ప్రాజెక్టు మైలార్‌దేవ్‌పల్లి సెక్టార్ మార్కండేయనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హజరై మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షంలో భాగంగా శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, చిరుధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారణ గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. చిరుధాన్యాలలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని మహిళలు తప్పకుండా తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని, గర్భిణిలు, బాలింతలు, రక్తహీనతతో బాధపడుతున్న వారు వీటిని తీసుకోవడం చాలా మంచిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కండేయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ చైర్మన్ వీడం రమేష్, అంగన్‌వాడీ టీచర్లు రత్న, మాధవి, అనిత, లక్ష్మీ, సుజాత, స్వప్న, ఏఎన్ఎం ప్రేమదేవి, ఆశా వర్కర్ సరిత, ఆర్పీ నాగమణి, హెల్పర్ శోభ తదితరులు పాల్గొన్నారు.

## వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ(టెక్నాలజీ మేనేజ్మెంట్) మొదటి సెమిస్టర్, ఎంపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలతోపాటు దూరవిద్య ద్వారా అందించే ఎంసీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## 'ఎర్లీబర్డ్‌పై అవగాహన పెంచండి'



బిల్ కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్

బండ్లగూడ, ఏప్రిల్ 10: ఎర్లీబర్డ్ స్కీంపై ప్రజలకు అవగాహన కల్పించి 5 శాతం రిబేట్‌తో పన్ను వసూలు చేసేందుకు చర్య లు తీసుకోవాలని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ బిల్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఆయన బిల్ కలెక్టర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్ నెలలో పన్నులు చెల్లించిన వారి కి ఐదు శాతం అవకాశం ఉంటుందని ఆయ న తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా బిల్ కలెక్టర్లు ఇంటింటికి వెళ్లి ఎర్లీబర్డ్ స్కీంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి వారి నుంచి పన్ను వసూలు చేసేందుకు కృషి చేయాలన్నారు.

## కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల అరెస్ట్ అప్రజాస్వామికం

హిమాయత్‌నగర్,ఏప్రిల్ 10: ఉద్యోగ భద్రత కోసం శాంతియుతంగా నిరసన చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని తెలంగాణ కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ. యూసుఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ విద్యను నీరుగార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. అనేక ఏండ్లుగా యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేసే ఉద్యమానికి తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన

బేగంపేట్, ఏప్రిల్ 10: కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్, టెక్ మహేంద్ర ఫౌండేషన్ స్మార్ట్ సెంటర్ సంయుక్తాధ్వర్యంలో నిరుద్యోగ యువతకు తగిన ఉచిత శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ, ఇంటర్, డిగ్రీ చదివిన యువతకు హెల్త్‌కేర్ రంగం, బిల్డింగ్ ఎగ్జిక్యూటివ్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ తదితర ఉద్యోగాలను తగిన శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తామని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్. నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు వెయ్యి మందికి ఉపాధి కల్పించినట్టు వారు తెలిపారు. అలాగే దరఖాస్తు చేసుకున్న యువతకు ప్రధానంగ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ టైపింగ్ తదితర వాటిపై ఉచితంగా శిక్షణ అందిస్తామని, అనంతరం ఉద్యోగం కూడా కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. యువతీయువకులు తగిన అర్హత కలిగిన సర్టిఫికెట్లతో సికింద్రాబాద్ ప్యారడైజ్‌లోని పాత సన్షైన్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న కార్యాలయంలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు ఫోన్: 82472 55859, 80198 18841 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

## చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేయాలి

### మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహా



శంషాబాద్ మండలం నర్ఖూడ గ్రామంలో మత్స్య కార్మిక సంఘం సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు జి నర్సింహా, పాల్గొన్న మహిళలు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 10 : రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా వందశాతం రాయితీపై చేపలను పంపిణీ చేసి కార్మికులకు ఆదుకోవాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి నర్సింహా డిమాండ్ చేశారు. గురువారం మత్స్యకార్మికుల సమస్యల పరిష్కారం కోసం మండలంలోని నర్ఖూడ గ్రామంలో మహిళా కార్మికులతో ప్రత్యేక సమావేశం ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా చేపలు వందశాతం రాయితీపై ఇచ్చి ఆదుకోవాలన్నారు. చెరువులు, కుంటలలో వారికి పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. చెరువులలో రొయ్య పిల్లలను ఉచితంగా పంపిణీ చేసి సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలన్నారు. మత్స్యకార్మికుల కోసం గత ప్రభుత్వం హైదరాబాద్ సమీపంలోని కోహెడ వద్ద 10 ఎకరాల స్థలం మార్కెట్ నిర్మాణం కోసం రూ.47 కోట్లు కేటాయించింది. కాని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇప్పటికి పనులు ప్రారంభం చేయకపోవడం ఏమిటని నిలదీశారు. మత్స్య మిత్ర మహిళా గ్రూపులను పునరుద్ధరించి సొసైటీకి రూ.10 లక్షల ఆర్థిక సాయంతో పాటు రూ.10 లక్షల ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా మత్స్య కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నీరటి మల్లేష్, అనురాధ, జ్యోతి, మాధవి, సరస్వతి,లక్ష్మి, లతిక పాల్గొన్నారు.



అవగాహన: పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గురువారం రహమత్ నగర్ డివిజన్ కార్మిక నగర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్మికనగర్ బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.సాయి మాధురి, ఆర్‌బీఎస్ కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మమత పాల్గొని చిన్నారులు, గర్భిణిలు, తల్లిదండ్రులతో పోషకాహారం తీసుకునేలా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో టీచర్‌లు ధనలక్ష్మి, అనిత, పుణ్యవతి, సుమతి, రజిత, స్రవంతి, సావిత్రి, నాగరాణి పాల్గొన్నారు. -జూబ్లీహిల్స్



### అనాథ ఆశ్రమంలో ..

బోరబండ ప్రాంతానికి చెందిన గుండ్రాతి రవీందర్ గౌడ్, లావణ్య దంపతులు తమ కొడుకు లక్షిత్ మొదటి బర్త్ డేను గురువారం ఎర్రగడ్డ ప్రాంతంలోని సొసైటీ ఫర్ హెల్త్ అనాథాశ్రమంలో జరపుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రమాదేవి, దాసరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.- ఎర్రగడ్డ, ఏప్రిల్ 10:

## ఫొటోలు తీస్తూ.. బ్లాక్‌మెయిల్

### కేసు నమోదు

బంజారాహిల్స్,ఏప్రిల్ 10: అనుమతి లేకుండా జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లోనికి ప్రవేశిస్తూ బ్లాక్‌మెయిల్ కోసం ఫొటోలు తీస్తూ తప్పుడు ఫిర్యాదు ఇస్తున్నారంటూ జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో కొంతకాలంగా కొన్ని రినోవేషన్ పనులు నడుస్తున్నాయి. కాగా పెద్ది వేణుగోపాల్ అనే వ్యక్తి జేహెచ్ఐసీ ఆవరణలోకి అక్రమంగా ప్రవేశించి నిర్మాణ పనులను ఫొటోలు తీస్తున్నాడు. వాటిని జీహెచ్ఎంసీ అధికారులకు పంపిస్తూ తప్పుడు ఫిర్యాదులు ఇప్పిస్తున్నాడు. జీహెచ్ఎంసీ ఇచ్చిన నోటీసులకు తాము సమాధానం ఇచ్చినప్పటికీ లేనిపోని ఆరోపణలతో అధికారులను తప్పుదోవ పట్టించేందుకు వేణుగోపాల్‌తో పాటు అతడి అనుచరులు ప్రయత్నిస్తున్నారు. కాగా బుధవారం కూడా వేణుగోపాల్ అనుచరులు జేహెచ్ఐసీ ఆవరణలోకి వచ్చి ఫొటోలు తీసి బ్లాక్ మెయిల్ చేశారని, తమ సంస్థ వద్ద నుంచి డబ్బులు గుం జేందుకే వారు ఇలాంటి పనులు చేస్తున్నారంటూ మేనేజర్ జగదీశ్వర్ రెడ్డి గురువారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పెద్ది వేణుగోపాల్ తో పాటు అతడికి సహకరించిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల ఫలితాలు..

ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల ఫలితాలను అధికారులు విడుదల చేశారు. ఈ పోటీలను ఈనెల 4, 5 తేదీల్లో ఠాగూర్ ఆడిటోరియం, టెక్నాలజీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను ఈనెల 26న నిర్వహించనున్న ఓయూ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

### డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్.డబ్ల్యూ తదితర కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈనెల 30వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో వచ్చేనెల 7 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను జూన్ నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## ఖాళీ స్థలాలు కనిపిస్తే..కబ్జానే

### ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల కూల్చివేత



జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 46లో జేఎన్ఆర్ఎం పక్కన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన గదులను కూల్చివేయిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బంజారాహిల్స్, ఏప్రిల్ 10: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న ఇండ్లను షేక్‌పేట్ మండల రెవెన్యూ సిబ్బంది గురువారం నేలమట్టం చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 46 లోని అంబేద్కర్‌నగర్‌ను ఆనుకొని ఉన్న జేఎన్ఆర్ఎమ్ ఇండ్ల పక్కన సుమారు 1500 గజాల ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉంది. గతంలో ఇక్కడ ఐదు బ్లాకులు నిర్మించాల్సి ఉండగా నాలుగు బ్లాకులు మాత్రమే నిర్మించారు. 64 మంది లబ్ధిదారులకు జేఎన్ఆర్ఎమ్ ఇండ్లను కేటాయించారు. కాగా, మరో బ్లాకు నిర్మాణం నిలిచిపోయింది. ఇటీవల బస్తీలోని కొందరు నేతలు ఖాళీ స్థలాన్ని తలా కొంచెం పంచుకుని ఇండ్ల నిర్మాణం ప్రారంభించారు. నెల రోజుల క్రితం వీటిని కూల్చిన రెవెన్యూ అధికారులు స్థానిక నేతలపై కేసు నమోదు చేశారు. అయితే మరోసారి రెండు రోజులుగా ప్రభుత్వ స్థలంలో గదుల నిర్మాణం చేపట్టడంతో సమాచారం అందుకున్న షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి తన సిబ్బందితో వచ్చి కూల్చివేతలు చేపట్టారు. ఈ క్రమంలో బస్తీనేతలు వెంకన్న, అరుణ తదితరులు రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. సెల్‌ఫోన్ లాక్కుని న్యూసెన్స్ చేశారు. ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ హెచ్చరించారు.

## కులవ్యవస్థ నిర్మూలనకు సీఐటీయూ పోరాటం



ఉద్దెంగడ్డ చౌరస్తాలో సామాజిక ఉద్యమాలకు విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 10: సాంకేతిక రంగంలో ఎంతో అభివృద్ధి చేందుతున్నప్పటికీ దేశంలో ఇంకా కులవ్యవస్థ రూపుమాపలేదన్నారు. దీనిలో భాగంగా గురువారం సీఐటీయూ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి వెంకటయ్య అధ్యక్షతన మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఉద్దెంగడ్డ చౌరస్తా వద్ద సామాజిక ఉద్యమాలకు విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడ లేని కుల వ్యవస్థ మనదేశంలో ఉందన్నారు. సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ సాటి మనిషిని మనుషుల్లాగా చూడలేని దుర్మార్గపు స్థితిలో నేటికీ కొనసాగుతుందన్నారు. అవమానం, కులం, మతం, ప్రాంతం లింగబేదం లాంటి సామాజిక రుగ్మతలను మన దేశంలో ప్రజలను, కార్మిక వర్గాన్ని ఐక్యం కానివ్వకుండా దారికడ్డంగా ముళ్లకంచలు ఉన్నాయన్నారు. కార్మికవర్గ ఐక్యతను విచ్చినం చేసి దోపిడీ వర్గాలు తమ ప్రయోజనాలు కాపాడుకుంటున్నాయన్నారు. సీఐటీయూ దేశం మొత్తం ఈ సమాజంలో అన్ని రకాల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి కేవలం జీతభత్యాలు కాకుండా సామాజిక అంశాలపైన సీఐటీయూ ముందుండి పోరాటం చేస్తుందన్నారు.

అంతేకాకుండా ఈనెల 6 నుంచి 14వరకు తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశంలో జరుగుతున్నటువంటి శ్రమ దోపిడీ కులవ్యవస్థ అంతంకై సామాజిక ఉద్యమం అనేది ప్రజలు, కార్మికులు సహకరించి ఇవ్వాలని ఈ నిధితో సామాజిక పోరాటాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నర్సింహ గౌడ్, బాబురావుయాదవ్, గోపాల్, శ్రీశైలం, శాంతమ్మ, రమేష్, సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'పేదల జోలికి వస్తే సహించేది లేదు'

బేగంపేట్, ఏప్రిల్ 10; పేదల జోలికి వస్తే సహించేది లేదని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. సనత్ నగర్‌లోని దాసారంలో సుమారు 300 కుటుంబాలు 30 ఏండ్ల నుండి గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. కాగా బుధవారం కొందరు వ్యక్తులు తమ ప్రాంతానికి తమ అనుచరులతో వచ్చి గుడిసెలు ఖాళీ చేయాలని హెచ్చరించారు. దీంతో ఆందోళనకు గురైన వారు గురువారం వెస్ట్ మారేడ్ పల్లిలోని కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎన్నో సంవత్సరాల నుండి తాము ఇక్కడే ఉంటున్నామని, ఇప్పుడు తమను వెళ్లిపోవాలంటే ఎక్కడికి పోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రెవెన్యూ, పోలీసు, జీహెచ్ఎంసీ తదితర శాఖల అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. పేదల జోలికి రాకుండా, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. బాధితుల వెంట సనత్ నగర్ డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, అమీర్ పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు సురేష్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, కుమార్, వనం శ్రీనివాస్, దాసారం గుడిసె వాసులు తదితరులు ఉన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

బండ్లగూడ, ఏప్రిల్ 10: యువకులు, విద్యార్థులను టార్గెట్ చేసుకొని గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్స్పెక్టర్ నాగేశ్వర రావు తెలిపిన వివరాల ప్రకా రం.. పహాడీషరీఫ్‌కు చెందిన జకీర్ మ హారాష్ట్రలోని అమరావతి నుంచి గంజాయిని తీసుకొచ్చి హైదరాబాదులోని హసన్‌నగర్ ప్రాంతంలో చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విద్యార్థులు, యువతను టార్గెట్ చేసుకొని అమ్మకాలు చేపట్టాడు. విశ్వసనీయ స మాచారం మేరకు అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర రావు తన సిబ్బందితో కలిసి అత డిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి కిలో గంజాయిని స్వా ధీ నం చేసుకొని సీజ్ చేశారు. అతడిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

### మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

బొల్లారం, ఏప్రిల్ 10: మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని బేగంపేట ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. గురువారం తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులకు ట్రాఫిక్ సీఐ మధుబాబుతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ.. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ట్రాఫిక్ కమిషనర్ జోయల్ డేవిస్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్ రాహుల్ హెగ్డే , వేణుగోపాల్ రెడ్డి అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ సూచనల మేరకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పట్టుబడిన మైనర్లపై మైన ర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు.అనంతరం వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్‌తో పాటు కొన్ని సూచనలు చేశారు.

**IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE R.R. DISTRICT : AT : IBRAHIMPATNAM**
**I.A. NO. 919 OF 2023**
**IN**
**O.S.NO. 22 OF 2021**

**Between:**
Ratnavath Sujatha and others ...Plaintiffs
**AND**
Banavath Chandu and others ...Defendants
To

**NOTICE**

1. T. Jangaiah, S/o. Venkataiah, R/o. H.No. 9-99/6, Laxminagar Colony, Bodupal, Medipalli Mandal, Medchal-Malkajgiri District.
2. ARM Farms Pvt. Ltd., H.No. 8-3-167/D/16, Phase 1, Kalyan Nagar, Near A.G. Colony, Hyderabad, Represented by Sindhuja Reddy.

...Respondents 16 & 17

Please take notice that the above case/I.A. stands posted to 21-04-2025 for your appearance before the Hon'ble Court and hence both of you are required to appear either in person or through your advocate on that day before the Hon'ble Court at 10.30 AM, failing which the matter may be decided ex-parte against you.

**Sd/- M.NAGESWARA RAO,**
**Advocate for the plaintiffs**
H.No. 2-214, Old No. 5-19/142, Plot Not. 142, Raji Reddy Nagar, Dammaiguda, Keesara Mandal, Medchal-Malkajgiri District, Hyderabad-500 083.